నిరుద్యోగ భృతి అమలు ఎప్పుడో?

- నిరుద్యోగ యువతలో నిరాశ, నిస్పృహ
- కూటమి ప్రభుత్వం తీరుపై ఆగ్రహం
- ఏలూరు నగరంలో 35 వేల మంది నిరుద్యోగులు


నిరుద్యోగ భృతి ఇవ్వాలంటూ ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): సార్వత్రిక ఎన్నికల్లో సూపర్ సిక్స్.. స్వీట్ సిక్స్ అంటూ ఊదర గొట్టి తీరా అధికారంలోకి వచ్చాక కూటమి నేతలు చేతులెత్తేయడంపై నిరుద్యోగ యువతీ యువకులు, డీఎస్సీ అభ్యర్థులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు దాని గురించి మాట్లాడకపోవడం తమను నమ్మించి మోసం చేయడమేనని ఆరోపిస్తున్నారు. పాలకులు నిరుద్యోగులతో ఆటలాడుకోవడం తగదని హెచ్చరిస్తున్నారు.

ఎదురుచూపులు

ఏలూరు నగరపాలక సంస్థలో దాదాపు 3.50 లక్షల మంది జనాభా ఉన్నారు. వీరిలో 10 శాతం నిరుద్యోగ యువతీ యువకులు ఉన్నారు. ఈ లెక్కన ఒక్క ఏలూరులోనే 35 వేల మందికి పైగా నిరుద్యోగులు ఉన్నారు. వీరంతా ప్రభుత్వం తమకు ఉద్యోగాలు కల్పిస్తుందని లేని పక్షంలో ప్రతి నెలా నిరుద్యోగ భృతి రూ.3 వేలు చొప్పున అందిస్తుందనే ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు. అయితే దీనిపై కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయకపోవడం పట్ల వారు గుర్రుగా ఉన్నారు. భవిష్యత్తులో కూటమి పార్టీలకు తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరిస్తున్నారు.

ముందుకెళ్లని మెగా డీఎస్సీ

అధికారంలోకి రాగానే డీఎస్సీ అభ్యర్థుల కంటి నీరు తుడిచే విధంగా డీఎస్సీ ప్రకటన చేశారు. 14 నెలలు కావస్తున్నా దీనిపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పాలకులు మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులైన తమను మోసం చేశారంటూ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమలు చేయలేని దొంగ హామీలు ఇచ్చి నిరుద్యోగులతో ఆటలాడుకోవడం తగదని వాపోతున్నారు.

ఆప్కాస్ రద్దు యోచన వద్దు

గత ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఆప్కాస్ విధానం రద్దు చేసే యోచనలో కూటమి ప్రభుత్వం ఉండటం పట్ల ఏలూరు నగరపాలక సంస్థ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్ట్ ఏజెన్సీలు, సంస్థలు, వ్యక్తులు లేకుండా ఆప్కాస్ ద్వారా నేరుగా ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించడం, పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల్లో తమతమ వాటాను జమ చేయడం వంటి వాటి వల్ల జిల్లాలోని సుమారు 10 వేల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరింది. ఆప్కాస్ రద్దు చేసి మరలా పాత విధానాన్ని ప్రవేశ పెడితే తమకు కష్టాలు తప్పవంటూ వారు ఆందోళన చెందుతున్నారు.

ఏటా జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి



ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఖాళీలను భర్తీ చేస్తామని, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామంటూ ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇవ్వాలి. తొలగించిన వాలంటీర్లను విధుల్లోకి తీసుకుని వారికి నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం అందించాలి.

– జి.సూర్యకిరణ్, జిల్లా కార్యదర్శి, డీవైఎఫ్ఐ, ఏలూరు జిల్లా

నిరుద్యోగులతో చెలగాటం



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైంది. గద్దె నెక్కి 14 నెలలు కావస్తున్నా నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు హామీ నెరవేర్చకపోవడం బాధాకరం. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడటం తగదు. తక్షణం నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు అందించాలి. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

– కె.లెనిన్, జిల్లా కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ, ఏలూరు జిల్లా

క్లుప్తంగా

'ఈఎస్ఐ స్త్రీ'లో స్వీపర్లు, టాయిలెట్ క్లీనర్లను చేర్చాలి


ఈఎస్ఐ అధికారులకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈఎస్ఐ స్త్రీ పథకంలో మున్సిపల్ స్కూల్స్ స్వీపర్లను, టాయిలెట్ క్లీనర్లను చేర్చాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఏలూరు నగర కమిటీ ఈఎస్ఐ అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. (స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయీస్) పథకం ద్వారా ఈఎస్ఐలో సభ్యులుగా చేర్పించి కార్మికులు వారి కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు, ప్రమాద బీమా సౌకర్యాలు అమలు చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.సోమయ్య, అధ్యక్షుడు లావేటి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి అంగులూరి జాన్ బాబులు మున్సిపల్ స్కూల్స్ స్వీపర్లతో కలిసి బుధవారం ఈఎస్ఐ ఏలూరు జిల్లా మేనేజర్ కె.లక్ష్మీబాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ కృష్ణవేణి, చలమల విజయలక్ష్మి, ఆంతోని, ఖాదరున్నిసా, లక్ష్మీరాజ్యం, ప్రమీల, వెంకట రమణ, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

క్షయపై విద్యార్థులకు అవగాహన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మధ్యాహ్నం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా టీబీ యూనిట్ సహకారంతో విద్యార్థులకు క్షయ వ్యాధిపై ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు అధ్యక్షత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గిరిబాబు మాట్లాడుతూ పూర్వంతో పోలిస్తే క్షయవ్యాధి ఎంతో అదుపులో ఉందని, పూర్తిగా నిర్మూలించడానికి భారత ప్రభుత్వం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. స్టేట్ పీపీఎం కోఆర్డినేటర్ ఎస్ అరుణ భూపతి, టీబీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ దేశాయి నాథ్ వర్మ, టీటీఎస్‌జేసీకే సాగర్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ జి.రఘు క్షయ లక్షణాలు, నిర్మూలనా విధానాలను వివరించారు. ఈ సందర్భంగా క్షయ నిర్మూలనకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం విజయ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన

పెదపాడు: ముంపునకు గురైన పంట పొలాల్లో తెగుళ్ల నుంచి పంటను కాపాడేందుకు కార్బెండిజమ్ లీటరు నీటికి ఒక గ్రామ్ పిచికారీ చేయాలని ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ కె.ఫణికుమార్, శాస్త్రవేత్త ఎస్.నాగేంద్ర బాబు తెలిపారు. బుధవారం పెదపాడు మండలంలోని కొణికి, సత్యవోలు గ్రామాల్లో పంట పొలాలను వ్యవసాయ అధికారి షేక్ ఇమామీ ఖాసితో కలిసి పరిశీలించారు.

శ్రీకాకుళం జిల్లాకు గౌతు లచ్చన్న పేరు పెట్టాలి


జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీ బీసీ జేఏసీ నాయకులు

ఏలూరు(మెట్రో) : ఏలూరు(మెట్రో): శ్రీకాకుళం జిల్లాకు సర్దార్ గౌతు లచ్చన్న శ్రీకాకుళం జిల్లాగా నామకరణం చేయాలని ఏపీ బీసీ జేఏసీ నాయకులు కోరారు. బుధవారం ఏపీ బీసీ కులాల జేఏసీ సంఘం ప్రతినిధులు జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఇప్పటికే భారతరత్న బీఆర్ అంబేడ్కర్, టంగుటూరి ప్రకాశం పంతులు, పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, వైఎస్ఆర్ పేర్లతో జిల్లాలు స్థిరపడ్డాయని తెలిపారు. రాష్ట్రంలో రెండున్నర కోట్ల మంది బీసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా, బీసీ చైతన్యానికి మార్గదర్శకుడిగా నిలిచిన సర్దార్ గౌతు లచ్చన్న పేరును ఆయన జన్మస్థలమైన శ్రీకాకుళం జిల్లాకు నామకరణం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ బీసీ కులాల జేఏసీ సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, ఏపీ బీసీ ఓబీసీ ఎంప్లాయీస్ కమిటీ చైర్మన్ ఎస్‌వీఆర్ విఠల్ కుమార్, లక్కోజు గోపాల చారి, ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా ఏపీ బీసీ ఓబీసీ ఎంప్లాయిస్ కమిటీ చైర్మన్ పామర్తి యేసురాజు, ముదుగురు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

15న చలో విజయవాడకు తరలిరండి


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రమణారావు

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల 15న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమానికి భవన నిర్మాణ రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని యూనియన్ నాయకులు పిలుపు నిచ్చారు. ఏలూరు జిల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) ఏలూరు జిల్లా 6వ మహాసభలు సీఐటీయూ ఏలూరు కార్యాలయంలో యర్రా రాంబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. యూనియన్ జెండాను జిల్లా నాయకులు సీహెచ్ కొండలరావు ఆవిష్కరించారు. మహాసభలను సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు ప్రారంభించారు. మూడేళ్ల కార్యదర్శి నివేదికను జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు ప్రవేశపెట్టారు. ప్రతినిధులు నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడితేనే కార్మిక చట్టాలను రక్షించుకోగలమన్నారు. కార్మికులందరూ ఐక్యం కావాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.


ముంపులోనే ఉన్న వరి పొలాలు

ముంపులోనే పొలాలు

దెందులూరు: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పొలాలు ముంపులోనే ఉన్నాయి. ఏలూరు రూరల్ మండలం పాలగూడెం పంచాయతీ ఆశ్రం వైద్యశాల ఎదుట వ్యాస కాని బ్రిడ్జి కుడి ఎడమవైపు పొలాలన్నీ ముంపులోనే ఉన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి సూచనలు సలహాలు ఇవ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి


బోసురాజును సత్కరిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అమెరికా పన్నుల దెబ్బకు కుదేలైన ఆక్వా రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ ఫిషరీస్ ఫార్మర్స్ అసోసియేషన్ సెక్రెటరీ పెన్మెత్స బోసురాజు కోరారు. నగరంలో గ్రో బెస్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు ఆదుకుంటేనే ఆక్వా రంగం మనుగడ సాగిస్తుందన్నారు. సీనియర్ ఆక్వా కన్సల్టెంట్ డాక్టర్ బి.జగన్మోహనరావు మాట్లాడుతూ ఆక్వా రంగంలో అధిక దిగుబడి సాధించేందుకు మేలైన పద్ధతులను వివరించారు. వనామి రొయ్యల సాగు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. వర్షాకాలంలో ఆక్సిజన్ శాతం పెంపొందేందుకు క్యాల్షియం పెరాక్సైడ్, సోడియం కార్బోనేట్ మందులను వినియోగించాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ ఎం పార్థసారథి, ఆక్వా రైతు కలిదిండి అప్పల నరసింహరాజు, ఎన్‌వీఎస్‌కే వర్మ, గ్రో బెస్ట్ కంపెనీ సేల్స్ హెడ్ రాజేష్ గోవిందన్, ఎస్ నల్లియప్పన్ తదితరులు పాల్గొన్నారు.

అసంబద్ధ ఆరోపణలు తగదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఉపాధ్యాయుని సర్దుబాటు విషయంలో పెదవేగి ఎంఈఓ-1 నిర్ణయాన్ని తప్పుపడుతూ ఒక యూనియన్ నాయకులు ఆరోపణలు చేయడం తగదని ఎస్టీయూ పెదవేగి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరసా నాగార్జున, తాతపూడి ప్రవీణ్ కుమార్ ఏలూరులో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సందేహాలు ఉంటే ఎంఈఓను వివరణ కోరకుండా ఏకపక్షంగా పత్రికల్లో ఆరోపణలు చేయడం సమంజసం కాదని తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటి తొందరపాటు చర్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు.

ఎంఈఓ ఖండన

పెదవేగి హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కామర్స్ చెప్పే ఉపాధ్యాయులు లేక పడుతున్న ఇబ్బంది, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు, గ్రామ పెద్దల కోరిక మేరకే ఉపాధ్యాయుని సర్దుబాటు చేశామని ఎంఈఓ-1 బీటీఎస్ దేవి ఏలూరులో ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తనను సంప్రదించకుండా పత్రికా ప్రకటన ఇవ్వడంతో తాను తీవ్రంగా మనస్థాపం చెందానని, మండలంలో ఏదైనా సమస్య ఉంటే పరిష్కరించడానికి అవకాశం ఇవ్వకుండా తనపై దుష్ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నానని తెలిపారు.

సేవా సంఘాల ఏర్పాటు శుభ పరిణామం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సేవా సంఘాలు ఏర్పడడం శుభ పరిణామం అని, సామాజిక సేవ సంఘటితంగా చేసే అవకాశాలు వస్తాయని శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక గ్రీన్‌సిటీలోని లయన్స్ జిల్లా లీడర్షిప్ హాలులో నిర్వహించిన ఏలూరు లక్ష్మీ గణపతి లయన్స్ క్లబ్ నూతన చార్టర్ ప్రధాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏలూరు పరిసర ప్రాంతాల్లో మహిళల ఆరోగ్యం, బాలల వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నూతన సభ్యులకు సూచించారు. మల్లాది శివ పార్వతి నూతన అధ్యక్షులుగా ప్రమాణం చేశారు. కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి.సుభాష్ బాబు, కౌన్సిల్ చైర్మన్ మేక శ్రీరామ్ సురేష్, జిల్లా గవర్నర్ పాపారావు నాయుడు, పూర్వ జిల్లా గవర్నర్లు వేమా కోటేశ్వర రావు, ఈపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

ఏడుగురికి గాయాలు

ఏలూరు టౌన్: కుక్క అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, ఆటోలో ఉన్న ఆరుగురు గాయాలపాలయ్యారు. విజయనగరం గంటియాడ మండలం కోటూరు బ్రిడ్జి గ్రామానికి బండారి సింహాచలం, బోను ఆయ పార్వతి, బంగారు మహాలక్ష్మి, బంగారు లక్ష్మి, బండారు ఆశనికి, బంగారు కన్నమనాయుడు, బోను నాగ విజయలక్ష్మి, మరో ఇద్దరు కలిసి బుధవారం తెల్లవారుజామున డ్రైవర్ పోలాపు కనకారావు (40) ఆటో ఎక్కారు. ఆటో ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ నుంచి శనివారపుపేటకు వెళ్తుండగా మార్గమధ్యలో అమీనాపేట సెంటర్ లో బ్రిడ్జి వద్ద కుక్క అడ్డువచ్చింది. దీంతో ఆటో అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కనకారావు తీవ్రంగా, ఆరుగురు ప్రయాణికులకు స్వల్పంగా గాయాలయ్యారు. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా పీవీఎన్ మాధవ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నారని, సెప్టెంబర్ 3న ఏలూరులో పర్యటించనున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్ తెలిపారు. బుధవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో విక్రమ్ కిషోర్ అధ్యక్షతన జిల్లా సమావేశం నిర్వహించారు.

ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఎటువంటి ప్రాణ నష్టం కలగకుండా నివాసిత ప్రాంతాల ప్రత్యేక అధికారులు చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాలు, వరదల పరిస్థితిపై బుధవారం సాయంత్రం మండల, నివాసిత ప్రాంతాల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

13న మెగా లోక్ అదాలత్

చింతలపూడి : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సెప్టెంబర్ 13న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి సీహెచ్ మధు బాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం కోర్టు ఆవరణలో పోలీస్ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ టి.క్రాంతి కుమార్, ఎక్సైజ్ సీఐ పి.అశోక్, చింతలపూడి, టి.నర్సాపురం, ధర్మాజీగూడెం, తడికలపూడి ఎస్సైలు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	24	బీన్సచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	24	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	44	కంద	00
కాకర కాయలు	24-30	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	26	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20-24	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	46

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	36
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి కమిటీ ఏర్పాటు


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ఏలూరు జిల్లా కమిటీని ఏలూరులో ఏర్పాటు చేశారు. సమితి గౌరవ అధ్యక్షుడిగా పేరిచర్ల రామరాజు, అధ్యక్షుడిగా నారా శేషు, ప్రధాన కార్యదర్శిగా తూతా బాలాజీ కుమార్, జిల్లావ్యాప్తంగా సభ్యులతో జిల్లా కమిటీని ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 27 నుంచి జరిగే గణపతి నవరాత్రులకు అధికారులు సహకరించాలని కోరారు.

ఆయిల్‌పామ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): ఆయిల్‌పామ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ప్రమాదానికి గురై చనిపోతున్న కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు వారికి ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరఫున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియో ఇవ్వాలని, దీర్ఘకాలం వికలాంగులుగా మారిన వారికి ప్రభుత్వం పెన్షన్ అమలు చేయాలని కోరారు. పనిలో ప్రమాదం సంభవిస్తే వైద్య ఖర్చులు ప్రభుత్వమే అందించాలని పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఫ్యాక్టరీ యజమానుల నుంచి నష్టపరిహారం ఇప్పించాలని, విద్యుత్ శాఖకు ఉద్యాన శాఖ ఉత్తర్వులు ఇచ్చి కార్మికులందరికీ గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని రవి డిమాండ్ చేశారు.

ఒడిదుడుకులతో రొయ్య సాగు

- అయోమయంలో ఆక్వా రైతులు
- ధర పతనంతో నష్టాల బాట


రొయ్యలను ఎగుమతి చేస్తున్న కూలీలు

గణపవరం: అసలే నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న రొయ్య సాగుకు ట్రంప్ సుంకాల దెబ్బ గట్టిగానే తగిలింది. అన్ని రకాల కౌంట్ రొయ్యల ధర ఢమాల్‌మంది. ఒక్క రోజులోనే కేజీ రొయ్య ధర రూ.50 నుంచి రూ.60 వరకు పడిపోయింది. దీంతో రొయ్య రైతులు లబోదిబోమంటున్నారు. ట్రంప్ ఇటీవల రెండో విడతగా భారత దిగుమతులపై మరో 25 శాతం సుంకం పెంచుతున్నట్లు ప్రకటించిన రోజే రొయ్య ధర పడిపోవడం గమనార్హం. ఇప్పటికే వ్యాధులు చుట్టుముట్టి 75 శాతం రొయ్యల చెరువులు ఖాళీ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా మాత్రమే రొయ్య సాగు కొనసాగుతుంది. దీంతో సరకు అవసరానికి సరిపడా లేకపోవడంతో వ్యాపారులు రొయ్య ధర బాగా పెంచేశారు. ఈ నెల ఆరంభం నుంచి రొయ్య ధర కిలోకు రూ.60 నుంచి రూ.100 వరకూ పెరగడంతో రొయ్య రైతులు సంబరపడ్డారు. అప్పటికే చాలా చెరువులు ఖాళీ అవడంతో మిగిలిన కొద్దిపాటి రైతులకైనా పెంచిన ధరలు దక్కి, నష్టాల ఊబి నుంచి బయటపడతారని ఆశించారు. అయితే అనుకోని పిడుగులా రెండో సారి ట్రంప్ సుంకాల పెంపుదల రొయ్య ధరపై తీవ్ర ప్రభావం చూపింది.

భారీగా తగ్గిన ధర

దీంతో 100 కౌంట్ రొయ్య కిలో రూ.280 వరకూ కొనుగోలు చేయగా ట్రంప్ భారత్ దిగుమతులపై మరో 25 శాతం సుంకాలు పెంచినట్లు ప్రకటించడంతో ఒక్క సారిగా 100 కౌంట్ రొయ్య ధర కిలో రూ.240 పడిపోయింది. ఇక మిగిలిన కౌంట్‌లో ఉన్న రొయ్యల ధరకూడా కిలోకు రూ.50 పైనే తగ్గించేశారు. మన దేశం నుంచి అమెరికాకు ఎక్కువగా 40 లోపు కౌంట్ రొయ్యలే ఎగుమతవుతాయి. ఆ దేశానికి 50కు పైన కౌంట్ ఉన్న రొయ్యలు వెళ్లే సమస్యే లేదు. అయినా 100 కౌంట్ రొయ్య ధరను కూడా వ్యాపారులు భారీగా తగ్గించేశారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు భారత దిగుమతులపై మరో 25 శాతం సుంకం పెంచుతున్నట్లు ప్రకటించగానే పనిలో పనిగా అమెరికా దేశానికి ఎగుమతి చేయని రొయ్యల ధర కూడా వ్యాపారులు తగ్గించేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అమెరికా పెంచిన దిగుమతుల సుంకాలు ఈ నెల 7వ తేదీ నుంచి అమలులోకి రాగా, రెండో సారి పెంచిన 25 శాతం సుంకాలు ఈ నెల 27వతేదీ నుంచి అమలులోకి రానుంది. మొత్తానికి ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు ఆక్వా రంగాన్ని అతలాకుతలం చేస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాలలో రొయ్యసాగు జరుగుతుంది. కాల్వలకు నీరు వదిలాక జూన్‌లో సీడ్ వేసిన చాలా చెర్వులు సీడ్‌వేసిన నెలరోజులకే ఖాళీ అయ్యాయి. సీడ్‌లో నాణ్యత లేకపోవడం, వైరస్ వ్యాధులు ముప్పేట దాడి చేయడంతో మూడు వంతుల చెర్వులు అర్ధంతరంగా ఖాళీ అయ్యాయి. ఈచెర్వులలో కౌంట్ 200 నుంచి 300 వరకూ ఉండటం, రొయ్యకు సరైన ధర లేకపోవడంతో రైతులకు కనీసం సగం పెట్టుబడులు కూడా దక్కలేదు.


బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

వరద సహాయ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

కుక్కునూరు: వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలను సహాయ కేంద్రాలకు తరలించి భోజన, వసతి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస సహాయక కేంద్రాన్ని పరిశీలించారు. వరద సహాయ కేంద్రాల్లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, తారునీరు, టాయిలెట్లు, పారిశుద్ధ్యం సక్రమంగా ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. భోజనం తయారీలో నాణ్యమైన సరుకులు, కాయగూరలు వాడాలని, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందించాలని అన్నారు. వరద ముంపు తగ్గే వరకు ఆయా గ్రామాల ప్రజలు పునరావాస సహాయక కేంద్రాల్లోనే ఉండాలని సూచించారు.